భళా... మోడెం వంశీ

- అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ కైవసం
- 66 కేజీల జూనియర్స్ విభాగంలో సత్తా
- తెలంగాణ కీర్తిని చాటిన భద్రాద్రి వాసి

7





మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి
- మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు..
- ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే మైకులు ఉపయోగించాలి
- మండపాల జియో ట్యాగింగ్‌లో పోలీసులకు సహకరించాలి
- సెప్టెంబరు 16 నిమజ్జనోత్సవానికి భారీ బందోబస్తు
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్ 6
- స్తంభాద్రి గణేష్ ఉత్సవ కమిటీ, పీస్ కమిటీలతో సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మొదట ఆరోగ్యం... తర్వాతే ఉద్యోగం...

- ప్రతీ రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలి
- ఉద్యోగులకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచన 6
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ముగింపు కార్యక్రమం



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు



యువర్ అటెన్షన్ ప్లీజ్..



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై నిర్మాణంలో ఉన్న షెడ్

ప్రగతి పట్టాలపై రైల్వే పరుగు

ఖమ్మం, మధిర, కొత్తగూడెం రైల్వే స్టేషన్లలో ఆధునీకరణ జోరు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వేస్టేషన్లకు కొత్త కళ రాబోతోంది. ఆధునీకరణతో రైల్వేస్టేషన్లు కొత్త సొబగులు సంతరించుకోనున్నాయి. కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులతో ఇప్పటివరకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కానుండగా, అనేక నూతన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రూ.2245 కోట్లతో 1275 రైల్వేస్టేషన్లను ఆధునికీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, మధిర, కొత్తగూడెం రైల్వేస్టేషన్లలో ఆధునికీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏళ్లనాటి నిర్మాణాలతో అసౌకర్యాలకు నిలయంగా ఉన్న రైల్వేస్టేషన్లను ఆధునికీకరణతో ఆకర్షణీయంగా మారుస్తున్నారు.



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న ఏసీ వెయిటింగ్ హాల్



కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు

ఖమ్మం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో ఒకటిగా ఉన్న ఖమ్మం రైల్వేస్టేషన్‌లో రూ.25కోట్లతో మొదటిదశ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. తెలంగాణలో ఈ పథకం కింద 21 రైల్వేస్టేషన్లు ఆధునీకరణ జరుగుతుండగా, ఉమ్మడి జిల్లాలో 3 రైల్వేస్టేషన్లకు ఆ భాగ్యం దక్కింది.

ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా రోజుకు 90రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, సుమారు లక్షా 60వేల మంది ప్రయాణిస్తుంటారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతోపాటు పొరుగున ఉన్న ఏపీ ప్రయాణీకులు దేశంలోని పలు ప్రాంతాలకు ఖమ్మం మీదుగా ప్రయాణిస్తుండగా, పర్యాటకులు, భక్తులు తిరుపతి, షిరిడీ, తదితర పుణ్యక్షేత్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. హైదరాబాద్, వరంగల్, విజయవాడకు ఖమ్మం నుంచి నిత్యం వేలసంఖ్యలో ప్రయాణికులు వెళ్లివస్తుంటారు. అయితే లోకల్ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ప్రయాణిస్తున్న వారు ప్రస్తుతం ఆయా రైల్వేస్టేషన్లలో అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటినీ మార్పు చేసి ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.25 కోట్లతో పనులు నడుస్తున్నాయి. ప్రతీరోజు ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి 20నుంచి 25వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రోజు రూ.7నుంచి 10లక్షల ఆదాయం సమకూరుతోంది.

అభివృద్ధి పనులు ఇవే...

ఆధునీకరణ పనుల్లో భాగంగా ఖమ్మం రైల్వే స్టేషన్‌లో మొదటి ప్లాట్‌ఫారంలో 700మీటర్ల

(మిగతా 6వ పేజీలో)

- 'అమృత్‌భారత్' పథకం కింద ఒక్కో రైల్వేస్టేషన్‌కు రూ.25కోట్లు
- ప్లాట్‌ఫామ్‌లపై నూతనంగా షెడ్ల ఏర్పాటు
- కొత్తగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్స్...
- ఎంట్రన్స్‌ల వద్ద సుందరీకరణ
- దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు వసతి సౌకర్యం
- అధునాతన డిజిటల్ బోర్డు, కోచ్ ఇండికేటర్లు
- పరిశుభ్రంగా, అందరికీ అనువుగా మరుగుదొడ్లు
- మరో రెండు నెలల్లో పూర్తికానున్న అభివృద్ధి పనులు

నేను ఆత్మహత్య చేసుకుంటున్నా...

- 100కు ఫోన్ చేసి పురుగులమందు తాగిన వ్యక్తి
- సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా గుర్తించి ఆస్పత్రికి తరలించిన బ్లూకోల్ట్స్ పోలీసులు
- మణుగూరు సింగరేణి ఏరియాలో ఘటన
- కుటుంబ కలహాలే కారణం

మణుగూరు, ఆగస్టు 29: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు డయల్ 100కి కాల్ చేసి చెప్పి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసిన వ్యవహారం కలకలం రేపింది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అతడి ఆచూకీ కనుగొన్న బ్లూకోల్ట్స్ పోలీసులు ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడేనికి చెందిన హుస్సేన్ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం యూజీ మైన్‌లో పనిచేస్తూ మణుగూరు మండలంలోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నాడు. అయితే వివాహితుడైన అతడికి తన భార్యతో గొడవలున్నాయి. ఈ క్రమంలో గురువారం బాగా మద్యం తాగి ఓ కారులో గుర్తు తెలియని ప్రాంతానికి వెళ్లి డయల్ 100కు ఫోన్ చేసి తాను పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఫోన్‌స్విచ్ ఆఫ్ చేశాడు.

దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మణుగూరు ఎస్‌ఐ మేడ ప్రసాద్ వెంటనే అతడి లోకేషన్‌ను కనుగొని బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది కోటేశ్వరరావు, వసంతరావులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా సంతోషనగర్ శివారు అటవీప్రాంతంలో ఓ కారులో అద్దాలు మూసుకొని హుస్సేన్ అపస్మారక స్థితిలో కనిపించాడు. పోలీసులు కారు అద్దాన్ని పగులగొట్టి హుస్సేన్‌ను బయటికి తీశారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని వెంటనే సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సత్వరమే స్పందించి ఓ ప్రాణాన్ని కాపాడేందుకు చొరవ చూపిన పోలీసు అధికారిని, సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.



హుస్సేన్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్న పోలీసు



ఏరియా ఆస్పత్రిలో హుస్సేన్

2న పాలేరు జేఎన్‌టీయూలో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మం ఖానాపురం హవేలి ఆగస్టు 29: పాలేరు జేఎన్‌టీయూలో సెప్టెంబర్ 2న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 2024-25వ సంవత్సరం ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు రూ.1300, ఎప్‌సెట్‌లో అర్హత సాధించని విద్యార్థులు రూ. 2100చెల్లించి స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. 2న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్ జేఎన్‌టీయూ కళాశాలలో ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. గత మూడు కౌన్సెలింగ్‌ల్లో సీట్లు రాని విద్యార్థులు ఈ స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనవచ్చునని తెలిపారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు, 2024 ఎప్‌సెట్ ర్యాంక్ కార్డు (అర్హత సాధించిన విద్యార్థులు), కుల, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. కళాశాలకు మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయి భవన అనుమతులు వస్తాయని, ఫస్టియర్ విద్యార్థులకూ హాస్టల్ అందుబాటులోకి వస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

కలెక్టరేట్‌లో ఎస్బీఐ బ్రాంచ్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29: ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ప్రారంభించారు. అన్ని శాఖల కార్యాలయాలు కలెక్టరేట్‌లో ఉండడంతో ఉద్యోగుల సౌకర్యార్థం బ్యాంక్ శాఖను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. బ్యాంక్‌లో అన్ని రకాల సేవలు అందేలా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఉద్యోగులు బ్యాంకు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ, బ్యాంకర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత ఆగమాగం

ఇటు పూర్తిస్థాయిలో అందని రుణమాఫీ.. అటు ఎప్పుడొస్తుందో తెలియని రైతుభరోసా..

వైరా, ఆగస్టు 29: ఒక వైపు రూ.రెండు లక్షల రుణమాఫీ సొమ్ము పూర్తిస్థాయిలో అందక.. మరోవైపు వానాకాలం సాగు సాయానికి సంబంధించిన రైతు భరోసా(గతంలో రైతుబంధు)సహాయం రాక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొంతమంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగినా, మెజారిటీ రైతులకు ఇంకా ఆ నిధులు అందలేదు. మరోవైపు ఇంతవరకు రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రభుత్వం రూ.18వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేసినా సాగు సాయం అందించకపోవడంతో రైతుల దృష్టిలో ప్రభుత్వ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018నుంచి 2023వరకు వరుసగా ఆరు సంవత్సరాలు వానాకాలం, యాసంగికి రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చింది. కానీ ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం కింద నయాపైసా ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం పేరుతో అనర్హులకు పెట్టుబడి సాయం కింద రూ.25వేలకోట్లు చెల్లించారని, అందువల్ల అనర్హులను తొలగించి అక్రమాలను అరికట్టిన తర్వాతనే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతుభరోసా విధివిధానాల కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులతో ఒక సబ్‌కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ ఎన్ని ఎకరాలకు పెట్టుబడిసాయాన్ని అందించాలనే దానిపై విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. అంతేకాకుండా సహకార సంఘాల పరిధిలో రైతుభరోసా విధివిధానాలపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కూడా ప్రభుత్వం చేసింది. జిల్లాస్థాయిలో మంత్రుల సబ్‌కమిటీ సమావేశాలు నిర్వహించి రైతు సంఘాలు, రైతుల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించింది. అయితే ఈ వానాకాలం వ్యవసాయ సీజన్ ముగియటానికి ఇంకా కేవలం ఒక్కనెల మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇంతవరకు పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టత రాలేదు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఎకరాకు రూ.10 వేలు అందజేసింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఏడాదికి ఈ రెండు వ్యవసాయ సీజన్లకు సంబంధించి రూ.15వేలు పెట్టుబడి సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. అంతేకాకుండా కౌలు రైతులకు ఏడాదికి రూ.12వేలు చెల్లిస్తామని కూడా ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలవుతున్నా ఇంతవరకు రైతుభరోసాపై ఎలాంటి విధివిధానాలను ప్రకటించపోవడంపై తీవ్ర

(మిగతా 6వ పేజీలో)

- జిల్లాలో ఇప్పటి వరకు 1,15,346మందికే అందిన మాఫీ
- ఇంకా 2లక్షల మందికి దక్కని అవకాశం
- ఊసులేని సాగుసాయం పథకం
- మరో నెలరోజుల్లో ముగియనున్న వానాకాలం సాగు సీజన్
- పెట్టుబడి డబ్బుల కోసం అష్టకష్టాలు
- రెంటికీ చెడ్డ రేవడిలా మారిన ప్రభుత్వ పరిస్థితి

లెదర్‌పార్కుకు మోక్షం ఎన్నడో!?

- ఉపాధి లేక దళితుల తిప్పలు
- రెండు దశాబ్దాలుగా ఎదురుచూపులు
- డిప్యూటీ సీఎం భట్టిపైనే ఆశలు

మధిర, ఆగస్టు 29: మధిర.. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఎస్సీ నియోజకవర్గం. ఎన్నికలొస్తే రాష్ట్ర ప్రజలు, ఆ సామాజిక వర్గం చూపంతా మధిరపైనే. ఇక్కడ మాదిగ సామాజికవర్గం రాష్ట్రంలోనే అత్యధికం. ఎంఆర్‌పీఎస్ ఉద్యమ నేత మంద కృష్ణమాదిగ దండోరా ఉద్యమానికి ప్రాణం పోసింది కూడా ఇక్కడనే. ఇప్పుడు మధిర ప్రజాప్రతినిధిగా ఉన్న భట్టివిక్రమార్క రాష్ట్రంలోనే కీలకస్థానంలో ఉండి స్వయంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే చక్రం తిప్పుతున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న మధిరలో దళితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు శూన్యం.



దళితులకు లెదర్ పార్కు కోసం కేటాయించిన 26 ఎకరాల స్థలం ఇదే

రెండు దశాబ్దాల క్రితం 2002లో స్థలం కేటాయింపు జరిగి కార్యాచరణకు నోచుకోని లెదర్ పార్కుకు ఇకనైనా మోక్షం లభిస్తుందా అని దళిత సమాజం ఎదురుచూస్తోంది. ప్రభుత్వాలు ఎన్నో మారుతున్నాయి.. అయినా... మా సమస్యలకు పరిష్కారం లేదా అని మధిర నియోజకవర్గం దళిత ప్రజల ఆవేదన. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం కావడంతో తమ కష్టాలు తీరుతాయని, అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యంత దళిత జనాభా కలిగిన మధిరలో దళితులకు ఉపాధి కల్పించే లెదర్‌పార్కు సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. దీనికి మడుపల్లిలోని సర్వే నెం.706లో 26 ఎకరాల స్థలం 2002లో కేటాయించి 2003లో లిడ్‌క్యాప్‌నకు అప్పగించినా.. ముందుకు కదలడంలేదు. ఎస్సీ ప్రజాప్రతినిధులున్న మధిరలో దళితులకు ఉపాధి కరువైంది. యువకులకు చేయూతనిచ్చేందుకు లెదర్‌పార్కు ఏర్పాటు రెండు దశాబ్దాల కల కలగానే మిగిలింది. ఇది పూర్తయితే జిల్లాలోని అనేక గ్రామాల్లోని దళితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఉమ్మడి ప్రభుత్వంలో 13గ్రామాలకు చెందిన లబ్ధిదారులను ఎంపికచేసి వారికి శిక్షణ కూడా ఇచ్చారు. వీరంతా ఒక సొసైటీని ఏర్పాటుచేసుకొని కొంత డిపాజిట్ సొమ్మును కూడా సమకూర్చారు. కానీ అప్పటినుంచి ప్రభుత్వంలో కదలిక లేదు. కొత్తప్రభుత్వం ఏర్పడిన ప్రతీసారి ఆందోళనలు చేయడం, ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. సమస్య మాత్రం తీరడంలేదు. ఇంతకాలం అగ్ర సామాజిక వర్గం ప్రభుత్వ పెద్దలుగా ఉండటంతో తమ సమస్య పరిష్కారం కాలేదని భావించారు.

అయితే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావొస్తుంది. డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క అనేక నిధులు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రకటించారు. కాని లెదర్‌పార్కు ఊసేలేకపోవడంతో దళితుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. మరో వైపు పలువురు కబ్జాకోరులు ఈ స్థలం ఆక్రమిస్తున్నారు. పలుసార్లు సర్వేలు చేసినా రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయని సభ్యులు ఆవేదన చెందుతున్నారు.



పార్కు స్థలం స్వాధీనం చేసుకొని సర్వే చేస్తున్న లిడ్‌క్యాప్ అధికారులు

లెదర్‌పార్కు ఇప్పటికైనా నిర్మించాలి

కటుకూరి శ్యామలరావు, లెదర్‌పార్కు లేబర్ సొసైటీ అధ్యక్షుడు



ఉమ్మడి రాష్ట్రంలో 2002లో మడుపల్లిలో లెదర్ పార్కుకోసం 26 ఎకరాల స్థలం కేటాయిస్తే ఎంతో సంతోషించాం. తమకు ఉపాధి వస్తుందని లేబర్ సొసైటీగా అందరం ఏర్పడ్డాం. శిక్షణ కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఎంతకాలమైనా పట్టించుకోలేదు. భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం కావడంతో తమకు ఆశలు చిగురించాయి. లెదర్ పార్కు వస్తుంది. తమకు ఉపాధి లభిస్తుందని యువత ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం. ఏవో కుంటి సాకులు చెప్పి తమ ఆశలపై నీళ్లు చల్లవద్దని వేడుకొంటున్నాం

పాలేరు జేఎన్‌టీయూకు రాని

భవనాల అనుమతులు

మొదటి సంవత్సరం విద్యార్థుల ఇబ్బందులు


పాలేరు జేఎన్‌టీయూ కళాశాల

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 29: ఖమ్మం జిల్లా పాలేరు జేఎన్‌టీయూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు ఏటీడీఏకు సంభందించిన భవనాలను పూర్తిస్థాయిలో అప్పగించకపోవటంతో 2024-25 విద్యా సంవత్సరంలో సీట్లు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇబ్బందులు తప్పటంలేదు. గత మూడు రోజులుగా మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాగా కేవలం డే స్కాలర్స్‌నే అనుమతిస్తున్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు ఎక్కువమంది ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉండటంతో వారికి హాస్టల్ సదుపాయం అందుబాటులో లేకపోవటంతో వారిని మరో వారం రోజులు కళాశాలకు రాకుండా ఆగాల్సిందిగా చెప్పినట్లు తెలిసింది. ద్వితీయ సంవత్సర విద్యార్థుల వరకే హాస్టల్ సదుపాయం ఉంది. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 330 సీట్లకుగాను 230మంది విద్యార్థులు సీట్లు పొంది హాస్టల్ సదుపాయంతోపాటు సరైన సౌకర్యాలు లేకపోవటంతో సీట్లు పొందిన పలువురు విద్యార్థులు మరో కళాశాలలో చేరినట్లు తెలిసింది. ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు 160 మందిలో 100మంది వరకు హాస్టల్ సదుపాయం లేకపోవటంతో తరగతులకు హాజరుకావటం లేదని తెలిసింది. భవనాల అనుమతుల కొరకు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రోజు కలెక్టరేట్ అధికారులను కలిసి విద్యార్థుల ఇబ్బందుల గురించి వివరిస్తున్నా.. అటు కలెక్టరేట్ అధికారులు, రెవెన్యూ అధికారులు సరైన స్పందన లేకపోవటంతో అనుమతులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. భవనాలకు అనుమతులు వస్తేనే మొదటి సంవత్సరం హాస్టల్ విద్యార్థులు తరగతులకు హాజరుకానున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పాలేరు జేఎన్‌టీయూ కళాశాలకు భవనాలు పూర్తిస్థాయి అనుమతులు రావటంలేదనే విమర్శలు వినపడుతున్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు జేఎన్‌టీయూ కళావాల నుంచి మరో కళాశాలకు వెళ్తున్నా అధికారులు భవన అనుమతుల విషయంలో పట్టించుకోకపోవటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు సిద్ధమైనట్లు తెలిసింది. ప్రభుత్వ కళాశాల కావటం, పూర్తిస్థాయి సౌకర్యాలు, హాస్టల్ సదుపాయం అందుబాటులో ఉంటుందని జేఎన్‌టీయూకు మొదటి ఆప్షన్ ఇచ్చుకున్నామని తీరా వచ్చి చూస్తే ప్రస్తుతానికి హాస్టల్ సదుపాయానికి సమయం పడుతుందని మరో వారం రోజులు ఆగాల్సి అంటున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

కాంగ్రెస్ పార్టీని రైతులు క్షమించరు

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



తిరుమలాయపాలెం, ఆగస్టు 29: రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని రైతులు క్షమించరని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బీరోలు గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అమలుకాని హామీలు ఇచ్చి వాటిని అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ఇది రైతువ్యతిరేక ప్రభుత్వమని, రుణమాఫీ కాక రైతులు అల్లాడిపోతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందన్నారు. రైతాంగ సమస్యలపై కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సెప్టెంబరు 2నుంచి జాతీయస్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని, మండలాన్ని ముందువరుసలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.నరేందర్‌రావు, మేకతా సంతోష్‌రెడ్డి, నున్నా రవికుమార్, గుండా శ్రీనివాసరెడ్డి, నల్లగట్టు శ్రీను, బోడ బాలాజీ, వీరభద్రం సునిల్, బిక్షం, సురేష్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పొలం గట్లపై నడిచిన కలెక్టర్


మంచినీటి బావిని పరిశీలించేందుకు పొలంగట్టుపై వెళుతున్న కలెక్టర్

తిరుమలాయపాలెం, ఆగస్టు 29: ప్రస్తుత సీజన్‌లో డెంగ్యూ, మలేరియాతోపాటు విషజ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, వీటిపట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అజ్మీరతండా, తిప్పారెడ్డిగూడెంలలో డెంగ్యూ, విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అజ్మీరతండా నుంచి హైదరసాయిపేట వరకు చేపడుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పొలం గట్లపై కలెక్టర్ పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా మురికిగుంటలు, చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయని పారిశుధ్య పనులు చేపట్టడంలేదంటూ పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగునీటి కాలవలను శుభ్రం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎందుకు ఇలా తయారవుతున్నాయని ప్రశ్నించారు. అలాగే తాగునీటి పథకాలు, వాటర్‌ట్యాంకులు చేతిపంపుల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వివిధ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ రైతులకు సంబంధించిన పెండింగ్ భూసమస్యలను పరిశీలించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేశామని, దరఖాస్తుచేయాలని తెలిపారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమం కూడా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్‌బాడీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నిర్మల్‌శ్రేష్ఠ, తహసీల్దార్ వీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, డీఎంహెచ్‌వో సుబ్బారావు, వైద్యాధికారి అలివేలు, ఆర్‌ఐ లహరి, పాల్గొన్నారు.

ఎయిడ్స్, సుఖవ్యాధుల నియంత్రణకు

అవగాహన కల్పించాలి

క్షేత్రస్థాయి సిబ్బందితో డీఎంహెచ్‌వో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29: హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధుల నియంత్రణకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విసుబ్బారావు అన్నారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో గురువారం హెల్త్ వెల్నెస్ సెంటర్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు కలెక్టరేట్ మీటింగ్ హాల్లో హెచ్‌ఐవీ స్క్రీనింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో అందరికీ హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధుల నియంత్రణకు అవగాహన కల్పించాలన్నారు. అందరికీ హెచ్‌ఐవీ స్క్రీనింగ్ చేయాలని, హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చిన కేసులను దగ్గరలోని ఐసీటీసీ కేంద్రానికి పంపాలన్నారు. జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (ఎయిడ్స్ ,లెప్రసీ)డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌కి నిర్దేశించిన హెచ్‌ఐవీ టెస్టింగ్ లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు మాట్లాడుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ బి.సైదులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, యం.వి.పాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో డెమో సాంబశివరెడ్డి, జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది సత్య కుమార్ అలీ, వీరయ్య, రామకృష్ణ, జనవాణి, జాగృతి స్వచ్ఛంద సేవల సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని యాసంగి సీజన్ పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏప్రిల్ మొదటి వారంలో పూర్తిచేసింది. అయితే కాంగ్రెస్ ప్రకటించిన ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, కౌలురైతులకు పెట్టుబడి సాయంపై ఊసెత్తకపోవడంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిపోతోంది. ఖమ్మం జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018నుంచి 2023వరకు ఆరు సంవత్సరాలపాటు రైతుబంధు కింద పెట్టుబడి సాయంగా రూ.3,851.70కోట్లను చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.రెండులక్షల రుణమాఫీపై దృష్టిసారించి పెట్టుబడి సాయం గురించి మరిచిపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అందరికీ అందని రుణమాఫీ

ఈ ఏడాది ఆగస్టు 15నాటికి రూ.రెండు లక్షల సంపూర్ణ రుణమాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటించినా అది వాస్తవ దూరంగానే ఉందన్న విమర్శలున్నాయి. ఇప్పటివరకు రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ కింద రాష్ట్రంలో 22,37,848మంది రైతులకు రూ.17,933కోట్లను మాత్రమే చెల్లించింది. ప్రభుత్వం ప్రకటించినట్లు సుమారు 20లక్షల మంది రైతులకు రూ.13వేల కోట్ల పైచిలుకు రుణమాఫీ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ఖమ్మంజిల్లాలో ఈ మూడు విడతల్లో 1,15,346మంది రైతులకు రూ.766.61కోట్ల రుణమాఫీ జరిగింది. ఇంకా సుమారు 2లక్షల మంది రైతులకు రుణమాఫీ అందాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన రుణమాఫీ విలువ ఒక ఏడాదికి ఇచ్చే పెట్టుబడి సాయమంత మాత్రమే రైతులకు లభించింది. దాదాపు 60శాతం మంది రైతులకు రుణమాఫీ అందాల్సి ఉంది. రుణమాఫీ పూర్తిస్థాయిలో రాకపోవడమే కాకుండా ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు పెట్టుబడి సాయం కూడా కనుచూపు మేరలో అందే పరిస్థితులు లేక రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. ఇదిలా ఉంటే రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేసి పెట్టుబడి సాయం చేయకుండా అలాగే రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలుచేయలేకపోవడంతో రైతుల్లో అసంతృప్తి పెరిగిపోతుండటంతో ప్రభుత్వ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో రైతుభరోసా, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలుచేసి రైతుల్లో అసంతృప్తి పెరగకముందే నష్టనివారణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులు అలాగే రైతువర్గాలు కోరుతున్నాయి.

రైతు భరోసా విడుదల చేయాలి..

- బొంతు రాంబాబు, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి



వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడునెలలు పూర్తయ్యింది. ప్రభుత్వం రైతు భరోసా నిధులు నేటికీ విడుదల చేయలేదు. రైతుభరోసా విధివిధానాల రూపకల్పన జిల్లాస్థాయి చర్చలతో ఆగిపోయింది. అసెంబ్లీలో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది మరింత ఆలస్యం కాకుండా గత రబీ సీజన్‌లో రైతు బంధు నిబంధనలతోనే ఈ సీజన్‌లోనూ రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలి.

పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి

- బట్టా పెద్ద భద్రయ్య, రైతు, తాటిపూడి



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినట్లు రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి సాయాన్ని వెంటనే ఇవ్వాలి. ఇంతకముందు బీఆర్ఎస్ ప్రభుత్వం జూలై, ఆగస్టు నెలల్లోనే ఖరీఫ్‌లో రైతు పెట్టుబడి సాయాన్ని అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఖరీఫ్ పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు ఇవ్వలేదు. ఖరీఫ్ పెట్టుబడి సాయాన్ని విధివిధానాలతో నిమిత్తం లేకుండా సాగుచేసిన భూములన్నింటికీ చెల్లించాలి. అలాగే రుణమాఫీని పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న ప్రతి రైతుకు రూ.రెండులక్షల వరకు అమలు చేయాలి.

గందరగోళంగా రైతుల పరిస్థితి

- రాయల రమేష్, రైతు, రెబ్బవరం



రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం, ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. సాగుచేసిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు రూ.ఏడున్నర వేలు పెట్టుబడి సాయాన్ని వెంటనే ఇవ్వాలి. వానాకాలం సీజన్ ముగియటానికి ఇంకా కేవలం ఒక్కనెల మాత్రమే ఉంది. ఇప్పటికే మూడునెలలు గడిచిపోయింది. రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేశారు. రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో అమలుచేయాలి.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీపీ సునిల్‌దత్


నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు29: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ పేర్కొన్నారు. నగరంలోని సీక్వెల్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, శాంతి కమిటీలతో, వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు మండప నిర్వాహకులు కమిటీలు తప్పక పాటించాలన్నారు. గణేష్ మండపంలో 24గంటల పాటు విధిగా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. భక్తుల సందర్శనను దృష్టిలో పెట్టుకుని మండపాలలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

అదేవిధంగా గణేష్ మండపాల నిర్వాహకులు కమిటీల వివరాలు మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబరుతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు నగర పాలక సంస్థ, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, వైద్యశాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ శాంతియుత వాతావరణంలో ఈ ఉత్సవాలు జరుపుకునేలా కృషి చేస్తున్నట్టు సీపీ తెలిపారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

వినాయక నిమజ్జనానికి జిల్లా పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, సెప్టెంబరు 16 న జరిగే నిమజ్జనం కోసం భారీ పోలీసు బందోబస్తుతోపాటు అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనేందుకు స్విమ్మర్స్, క్రేన్లు, లైటింగ్, సీసీ టీవీలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయనున్నట్టు సీపీ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, ఇతర నీటికుంటల వద్ద వీధిదీపాలు, ఫ్లడ్‌లైట్లు అవసరం ఉన్న మేర క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలు సీపీ దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం గణేష్ విగ్రహాల నిమజ్జన సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాలోని మున్నేరు ప్రాంతాలను సీపీ అధికారులతో కలిసి సందర్శించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు , మార్గాలు, బారికేడింగ్ తదితర అంశలపై చర్చించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాస్, సాంబరాజు, సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేష్, భానుప్రకాష్, మోహన్‌బాబు, సతీష్, కమిటీ సభ్యులు వినోద్‌లాహోటీ, జయపాల్‌రెడ్డి, సుధాకర్, రామారావు, విద్యాసాగర్, శాంతికమిటీసభ్యులు హఫీజ్ జావీద్, అజీజ్, ఆసీఫ్ అహ్మద్, జమాల్‌పాషా పాల్గొన్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు:

- గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేస్తున్నప్పుడు కమిటీ సభ్యులు నిర్వాహకుల పేర్లు, సంప్రదింపు నెంబర్లు పొందుపరచాలి.
- విగ్రహ ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినది అయితే సంబంధిత వ్యక్తుల నుంచి ఎటువంటి అభ్యంతరంలేదని ధ్రువీకరణ పత్రం పొందాలి.
- నిర్వాహకులు విగ్రహాలను రహదారుల్లో కాని, వివాదస్పద స్థలాల్లో ప్రతిష్ఠించవద్దు.
- ప్రధాన రహదారులపై, ట్రాఫిక్ రద్దీపై ఉండే రోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేయరాదు.
- దరఖాస్తును పోలీసులకు సమర్పించేటప్పుడు విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు.
- రెండు మైకులతో కూడిన స్పీకర్‌లు మాత్రమే అనుమతించబడతాయి. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి.
- గణేష్ మండపాల జియోట్యాగింగ్ కోసం నిర్వాహకులు పోలీసుకలు సహకరించాలి, ఊరేగింపు సమయంలో అసౌకర్యాన్ని నివారించేందుకు నిర్వాహకులు చొరవ తీసుకోవాలి.
- అన్నదాన కార్యక్రమం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలుంటే ముందుగా పోలీసులకు తెలపాలి. పోలీసులు తగినంత బందోబస్తు ఏర్పాటు చేస్తారు
- గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు అసభ్యకర నృత్యాలు చేపట్టకూడదు. విగ్రహాల వద్ద మద్యం అమ్మకూడదు, సేవించకూడదు. విగ్రహాల వద్ద రాజకీయ ప్రసంగాలకు అనుమతిలేదు.
- అగ్నిప్రమాదాలు నివారించడానికి ప్రతి మండప వద్ద తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్‌గా ఉండేలా చూసుకోవాలని, తగినంత నీరు అందుబాటులో ఉంచాలి.
- నిమజ్జన కార్యక్రామనికి పరిమిత సంఖ్యలోనే అనుమతించబడతారు. ఊరేగింపు వాహనం డ్రైవర్ మద్యం సేవించకూడదు. సరైన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.
- సోషల్ మీడియాలో అసభ్యకర, మతపరమైన సందేశాలు రూపంలో వ్యాప్తి చేసేవారిపై చట్టపరంగా చర్యలు పోలీసులు తీసుకుంటారు. మండపాల వద్ద ఈవ్‌టీజింగ్ లేకుండా చూడాలి.

ప్రగతి పట్టాలపై రైల్వే పరుగు

(5వ పేజీ తరువాయి)

పొడవునా, రెండో ప్లాటఫారంలో 650 మీటర్ల పొడవునా షెడ్‌లను నిర్మిస్తున్నారు. అలాగే ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ హాల్, మూడో ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్ ఏర్పాటు చేస్తున్నారు. రీఫ్రెష్‌సెంటర్, స్టేషన్ ఎంట్రన్స్ సుందరీకరణ, రైళ్లరాకపోకలపై డిజిటల్ బోర్డు, కోచ్ ఇండికేటర్లు వంటి అధునాతన సౌకర్యాలు కల్పించనున్నారు. మరుగుదొడ్లను కూడా ఆధునీకరిస్తారు. దూరప్రాంతాలనుంచి వచ్చే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే వసతి సౌకర్యం కూడా కల్పిస్తారు. ప్రస్తుతం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాబోయే రెండు నెలల్లో పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఖమ్మం రైల్వేస్టేషన్ ప్రవేశమార్గంలో ప్రత్యేకంగా ఇన్, అవుట్‌గేట్ల ఏర్పాటు, ప్రయాణికులను ఆకర్షించేలా లైటింగ్ సదుపాయం, ఎలివేషన్ వంటి పనులకు కూడా రూపకల్పన చేశారు. ఎయిర్‌పోర్టు తరహాలో రైల్వేస్టేషన్‌ను వెలుగులతో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. స్టేషన్ ఆవరణలో కూడా కొత్తగా సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేస్తారు. రూ.25 కోట్లతో మొదటి విడత పనులు పూర్తికాగానే అమృత్‌భారత్ రెండోఫేజ్ పనులు ప్రారంభమవుతాయి. సికింద్రాబాద్, వరంగల్ తర్వాత ఖమ్మం రైల్వేస్టేషన్ పెద్దది కావడంతో ఈ స్టేషన్ అభివృద్ధికి రైల్వేశాఖ ప్రాధాన్యతనిస్తోంది.

మధిర రైల్వేస్టేషన్‌లో...

ఖమ్మం-విజయవాడ మధ్యలో ఉన్న మధిర రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్‌భారత్ పథకం కింద రూ.25కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన విధంగానే ఇక్కడ కూడా ప్లాట్‌ఫామ్‌లపై షెడ్ల నిర్మాణం, వెయిటింగ్ హాల్స్ డిజిటల్ బోర్డులు ఏర్పాటు, రైల్వేస్టేషన్ భవనాల ఆధునీకరణ, లైటింగ్, రోడ్లు ఏర్పాటు చేయబోతున్నారు.

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో...

భద్రాచలంరోడ్ స్టేషన్‌గా పిలవబడే కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లోకూడా అమృత్‌భారత్ పథకం కింద రూ.25కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం రూ.11 కోట్లతో మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భద్రాద్రి వెళ్లే భక్తులు, పర్యాటకులు, సింగరేణి, హెవీవాటర్ ప్లాంట్, నవభారత్, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి కార్మికులు ఉద్యోగులు, అధికారులు, ఇతర ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. స్లీపర్, అప్పర్‌క్లాస్ ప్రయాణికుల కోసం వెయిటింగ్‌హాల్‌తోపాటు ప్రత్యేక గదులు, పార్కింగ్, ఫుడ్‌ప్లాజా, గార్డెనింగ్‌తోపాటు ముఖద్వారం పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కొత్తగూడెం రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగ్యూ నిర్ధారణ చేయొద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారావు



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29: ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించి డెంగ్యూ కేసులను నిర్ధారించవద్దని.. విధిగా ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్‌లో ఎలీషా పరీక్ష ద్వారానే నిర్ధారించాలని.. నిబంధనలను పాటించని ఆస్పత్రులు, ల్యాబ్‌లపై కఠి న చర్యలు తీసుకోనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.సుబ్బారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ల్యాబ్‌లలో రాపిడ్ పరీక్షల ద్వారా డెంగ్యూ నిర్ధారించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. శాంపిల్‌ని జిల్లా ఆసుపత్రిలో ఐడీఎస్పీ ల్యాబ్ పంపి ఎలీషా పరీక్ష ద్వారా నిర్ధారణ చేసిన తరువాత తగిన చికిత్సలు అం దించాలని ఆయన ఆదేశించారు. ఇప్పటికే అన్ని ఆస్పత్రులకు ఉత్తర్వులు జారీ చేశామని, కొన్ని ఆస్పత్రులు మా త్రమే శాంపిల్స్‌ను ఐడీఎస్పీకి పంపి నిర్ధారణ చేసుకొంటున్నాయని తెలిపారు. అన్ని ఆస్పత్రులు తప్పనిసరిగా శాంపిల్ పంపి నిర్ధారణ చేసుకోవాలని లేకుంటే ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకోనున్నట్టు డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

మొదట ఆరోగ్యం... తర్వాతే ఉద్యోగం...

- ఉద్యోగులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచన

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 29: ప్రభుత్వ ఉద్యోగులు మొదట తమ ఆరోగ్యాన్ని వ్యాయామంతో మెరుగుపరుచుకోవాలని ఆ తరువాతనే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఏ ఉద్యోగి అయినా ప్రతి రోజు కనీసం 30నిమిషాలు నడక కానీ, జాగింగ్ కానీ ఏదైనా వ్యాయామం చేయట్లేదని తెలిస్తే వారికి పనిష్మెంట్ ఇస్తానని అన్నారు. అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్(ట్రైనీ) మ్రినాల్ శ్రేష్ఠ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, సెక్రటరీ వేల్పాద్రి, టీఎన్‌జీవోస్ అడ్‌హాక్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీనివాసరావు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్కు, స్టేడియం కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, సురేష్, సాంబమూర్తి ఉన్నారు.

కేఎంసీలో మహిళా ఉద్యోగికి వేధింపులు?

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: పదవీ విరమణకు సమీపంలో ఉన్న ఓ ఇంజనీరింగ్ అధికారి తోబుట్టవులా చూసుకోవాల్సిన మహిళా ఉద్యోగిని వేధింపులకు గురి చేసినట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చర్చ జరిగింది. కేఎంసీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారి తన సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగికి లేఖ రాయగా ఆ లేఖను మహిళా ఉద్యోగి పై స్థాయిలోని ఈఈ అధికారికి చూపించి తన గోడు తెలిపారు. దీంతో లేఖ రాసిన ఇంజనీరింగ్ అధికారిని ఛాంబర్‌కు పిలిపించి మందలించారని సమాచారం.

కాగా ఈ విషయాన్ని మేయర్‌కు, కమిషనర్‌కు తెలియకుండా గోప్యంగా ఉంచారని చర్చ జరుగుతుంది. మహిళా మేయర్ ఉన్న కార్యాలయంలోనే ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం మహిళా ఉద్యోగుల్ని విస్మయానికి గురిచేస్తోంది.

క్రైం సమాచారం

నటుడు వెలది రఘుకుమార్ కన్నుమూత


రఘుకుమార్(ఫైల్)

భద్రాచలం, ఆగస్టు 29: సీనియర్ మాజీ జర్నలిస్టు, సినీ, టీవీ నటుడు వెలది రఘుకుమార్(56) గురువారం చెన్నైలో ఛాతినొప్పితో కన్నుమూశారు. గత ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో అనారోగ్యానికి గురైన చికిత్స పొందుతున్నారు. ఉమ్మడి భద్రాచలం ప్రాంతవాసులకు సుపరిచితుడైన రఘు అకాల మరణం పట్ల పలువురు సహ జర్నలిస్టులు, ఆత్మీయులు సంతాపం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం మండలం నెల్లిపాకకు చెందిన రఘుకుమార్ గతంలో రాజమండ్రి, గుంటూరులో ఓ ప్రముఖ దినపత్రిలో విలేకరిగా పని చేశారు. ఓ సినీవారపత్రికకు చెన్నై, హైదరాబాద్‌లో సబ్ ఎడిటర్‌గా పని చేశారు. ఆ సమయంలో ప్రముఖ దర్శకుడు జంధ్యాల ప్రోత్సాహంతో ఆయన దర్శకత్వం వహించిన హుష్‌గుప్‌చిప్ చిత్రం ద్వారా రఘు డుంబు పేరుతో సినీరంగ ప్రవేశం చేశారు. బాలకృష్ణ రచించిన భైరవదీపం, దాసరి దర్శకత్వం వహించిన కంటే కూతుర్నే కనాలి, కృష్ణం రాజు నటించిన పల్నాటి పౌరుషంతో పాటు పలు సినిమాల్లో అయన నటించారు. అలాగే దూరదర్శన్‌తో పాటు పలు టీవీ సంస్థలు నిర్మించిన 80 సీరియల్స్‌లో నటించారు. అదేవిధంగా అమ్మా అనే డైలీ సీరియల్‌లో చివరి వరకు నటించి అందులో ఏకాక్షి పాత్ర ద్వారా మంచి పేరు తెచ్చుకున్నారు.

డెంగ్యూ లక్షణాలతో చిన్నారి మృతి


మహన్య(ఫైల్)

తిరుమలాయపాలెం, ఆగస్టు 29: ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో డెంగీ లక్షణాలతో గురువారం ఆరేళ్ల చిన్నారి మృతిచెందింది. దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బత్తుల నాగేశ్వరరావు, మహేశ్వరి దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వారిలో రెండో కుమార్తె అయిన మహన్య(6) వారంరోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఏలువారిగూడేనికి చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. అయినా చిన్నారి ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలోనే పెద్దకుమార్తె అమూల్య కూడా జ్వరం రావడంతో ఇద్దరిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వారికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికీ డెంగ్యూ లక్షణాలుండడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మహన్య గురువారం మృతిచెందింది. మహన్యకు డెంగీ లక్షణాలుండడంతో మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

బావిలో పడి యువతి...

బూర్గంపాడు, ఆగస్టు 29: బావిలో పడి యువతి మృతి చెందిన ఘటన గురువారం గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొత్తూరు యాదగిరి కుమార్తె ఆదిలక్ష్మి(22) మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. గురువారం తమ ఇంటికి సమీపంలోని బావి వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ఆ సమయంలో మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు యువతిని బయటకు తీసి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కరకగూడెం, ఆగస్టు 29: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నీలాద్రిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్దం దేవి (30) భర్త కోశయ్యతో గొడవ నేపథ్యంలో క్రిమిసంహారక మందు తాగినట్లు స్థానికులు తెలిపారని పేర్కొన్నారు. మృతురాలు తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురికి జైలు

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 29: దొంగతనం కేసులో నలుగురికి జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మూడో జ్యూడిషయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివనాయక్ గురువారం తీర్పు చెప్పారు. వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణానికి చెందిన కేటీపీఎస్ ఉద్యోగి ఆరగడ్డ శ్రీనివాసరావు 2018 జూలై 22న కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లి జూలై 25న తిరిగి వచ్చి చూడగా, ఇంటికి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న బంగారు బ్రా స్లేట్ 10.5 గ్రాములు, చెవి దిద్దులు ఐదు గ్రాముల బంగారాన్ని గుర్తు తెలియని దొంగలు దొంగలించారని బాధితుడు పాల్వంచ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అప్పటి కొత్తగూడెం టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. గోపి తన కేసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో పాల్వంచ మొండికట్టకు చెందిన పొన్నాల శివశంకర్, బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరుకు చెందిన జక్కుల వెంకన్న, పాల్వంచ ఇందిరా కాలనికి చెందిన బాణోత్ ప్రశాంత్, భద్రాచలం ఎఎస్ఆర్ కాలనీకి చెందిన వాడేపల్లి రమేష్‌లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయి. పాల్వంచ టౌన్‌కు సంబంధించి ఈ ఫిర్యాదుదారు అరగడ్డ శ్రీనివాసరావుకు సంబంధించిన బంగారు నగలు ఆ నలుగురి వద్ద రికవరీ చేశారు. దర్యాప్తు అనంతరం పాల్వంచ టౌన్ ఎస్‌ఐ ఎం. రమేష్ కోర్టులో చార్జీషిట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నలుగురిపై దొంగతనం నేరం రుజువుకాగా, వారికి పది నెలల కారాగార శిక్ష, నలుగురికి రూ.1000ల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎపీపీవో ఎస్. లావణ్య నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ ఎస్‌కే. ఘని (కోర్టు డ్యూటి ఆఫీసర్) పాల్వంచ టౌన్ పీసీ భాస్కర్‌లు సహకరించారు.

వరకట్నం వేధింపుల కేసులో వ్యక్తికి..

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 29: వరంగల్ జిల్లా వరంగల్ పట్టణ పెరికవాడకు చెందిన పబ్బినేని శ్రీనివాస్‌రెడ్డికి కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన పుణ్యావతికి 29మే 2013న వివాహం జరిగింది. వీరి వివాహ సమయంలో రూ.లక్షా50వేల నగదు, బంగారం, గృహ ఉపకరణాలు కట్నంగా ఇచ్చి వివాహం చేశారు. ఆ తర్వాత అత్త, భర్త అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగారు. అనంతరం ఆమె త్రీటౌన్‌పోలీస్‌స్టేషన్ నందు 11 డిసెంబరు 2015న భర్త పబ్బినేని శ్రీనివాస్‌రెడ్డి, అత్త పబ్బినేని విజయపై ఫిర్యాదు చేసింది. ఈ కేసులో రెండో అదనపు జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో దర్యాప్తు అనంతరం బి. రాజగోపాల్ చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ అ నంతరం ముద్దాయి పబ్బినేని శ్రీనివాస్ రెడ్డిపై నేరం కావడంతో రెండో అదనపు సివిల్ జడ్జి కే. సాయి శ్రీ అతడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెలరోజుల సాధారణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీవో బడిపాటి విశ్వశాంతి వాదించారు. లైజన్ ఆఫీసర్ ఎస్‌కే. ఘని, (కోర్టు డ్యూటీ ఆఫీసర్) కొత్తగూడెం త్రీటౌన్ పీసీ శోభన్‌బాబులు సహకరించారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

చంద్రుగొండ, అగస్టు 29: ఆలయాలల్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గురువారం చంద్రుగొండ స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. చుంచుపల్లి మండలం మర్రిగూడెం(గొత్తికోయ గుంపు)నకు చెందిన భద్రయ్య బుధవారం చంద్రుగొండ సెంటర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడిని విచారించగా చంద్రుగొండ మండలం రేపల్లేవాడ ఆలయంతో పాటు అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లోని పలు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ స్వప్న తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బంది కోటి, అశోక్‌లను సీఐ అభినందించారు.

100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

జూలూరుపాడు, ఆగస్టు 29: నాటు సారాన్ని తయారు చేసేందుకు నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని ఎక్సైజ్ శాఖ సిబ్బంది ధ్వంసం చేసిన సంఘటన గురువారం మండలంలోని మాచినేనిపేట తండాలో చోటు చేసుకుంది. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు మాచినేనిపేట తండాలోని లకావత్ శంకర్ తన సిబ్బందితో కలసి దాడులు చేయగా, పూరి గుడిసెలో 100 లీటర్ల బెల్లం పానకం పట్టుబడింది. దానిని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. పానకాన్ని తయారు చేసిన వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్స్ ప్రకాష్, ముత్తయ్య, సిబ్బంది సత్యనారాయణ, సాయి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

జూలూరుపాడు, ఆగస్టు 29: తల్లికి తలకొరివి పెట్టి కూతురు కన్న రుణం తీర్చుకున్న సంఘటన మండలంలోని అన్నారుపాడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అన్నారుపాడు గ్రామానికి చెందిన బాణోత్ సోని(75) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమెకు కుమారులు లేరు. నలుగురు కూమార్తెలే ఉన్నారు. దీంతో మూడోవ కూమార్తె బాదావత్ లక్ష్మి తన తల్లికి తల కొరివి పెట్టింది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

తిరుమలాయపాలెం, ఆగస్టు29: మండలంలోని సుబ్లేడు గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరాలపై ఎస్‌ఐ జగదీష్ గురువారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న వంగ లక్ష్మణ్, లంజపల్లి ప్రభాకర్, అనంతుల యోహన్, కె.నవీన్, గంధసిరి ఉమేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,500నగదు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మైదానాలే లేవు.. క్రీడలు ఎలా!?

- ప్రైవేటు పాఠశాలల్లో వాటి అలికిడే కనిపించదు
- ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణకు నిధుల కొరత
- పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియడ్‌ను ఏర్పాటు చేస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి
- పకడ్బందీగా అమలు చేయాలంటున్న విద్యానిపుణులు


పాఠశాలల్లో కనిపించని ఇలాంటి మైదానాలు

భద్రాచలం, ఆగస్టు 29: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో కీలకం. ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న సమయంలో చిన్నారులు చదువులపై దృష్టిసారించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియడ్ నిర్వహించడం లేదన్నది జగమెరిగిన సత్యం. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నా, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం ఆ పరిస్థితి దాదాపుగా లేదు. దీనికి కారణం చాలా ప్రైవేటు పాఠశాలలకు క్రీడా స్థలాలే లేకపోవడం ఒక లోటుగా కనిపిస్తోంది. సంవత్సరానికి ఒకసారి ఆ పాఠశాల వార్షికోత్సవం సమయంలో రెండు రోజులు పిల్లలకు పోటీలు నిర్వహించడం తప్పించి పాఠశాల యాజమాన్యాలు క్రీడలు నిర్వహించేందుకు ఆసక్తి కనబరచడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియడ్ తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు డిప్యుటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించడం ఆసక్తి రేపుతోంది. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించిన క్రమంలో అయన చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు స్పోర్ట్స్ పీరియడ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినా, ఆచరణలో ప్రైవేటు పాఠశాలలు ఎంత వరకు అమలు చేస్తాయనేది భవిష్యత్‌లో తేలాల్సి ఉంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,065 ప్రభుత్వ పాఠశాలలుండగా, 209 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 81 పీడీ పోస్టులుండగా, 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే పీఈటీ పోస్టులు 11 మంజూరు కాగా, అందులో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అత్యధిక శాతం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియడ్ ఇటీవల వరకు దాదాపుగా నిర్వహించడం లేదనే విమర్శలు లేకపోలేదు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం వారినికి ఒకసారి, రెండుసార్లు అయినా స్పోర్ట్స్ పీరియడ్‌లు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది.

ఇక ప్రైవేటు పాఠశాలల విషయానికొస్తే పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల అనుమతుల కోసం జిల్లా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు దరఖాస్తు చేసిన సమయంలో తమ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు, క్రీడామైదానం ఉన్నట్లు అధికారికంగా పత్రాల్లో చూపుతున్నారే కాని, ఆచరణలోకి వచ్చేసరికి అత్యధిక శాతం పాఠశాలలు క్రీడామైదానం లేనివే ఉన్నాయని చెప్పక తప్పదు. కొన్ని పాఠశాలల్లో కనీసం పీఈటీలు కూడా లేని పరిస్థితి ఉందంటే ప్రైవేటు పాఠశాలల నిర్వహణ ఏ తీరున ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్రీడామైదానాలేవీ...?

క్రీడామైదానమే లేని పరిస్థితుల్లో స్పోర్ట్స్ పీరియడ్ ఏ విధంగా నిర్వహిస్తారో సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ బృందాలకే తెలియాలని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం ప్రైవేటు స్కూల్స్‌లో 90 శాతం పైగా సొంత క్రీడామైదానాలు లేనివే ఉన్నాయని తెలుస్తోంది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు క్రీడామైదానాలున్నా, అవి క్రీడల నిర్వహణకు అనువుగా లేనట్లు సమాచారం.

చందాలతో క్రీడా పోటీలు

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాపోటీలకు వెచ్చించిన డబ్బులకు తిరిగి ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని సమాచారం. 9, 10 తరగతి విద్యార్థుల నుంచి డిస్ట్రిక్టు కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా ఫీజు రూ.100 వసూలు చేస్తుండగా అందులో రూ.3 ప్రతి విద్యార్థికి క్రీడల కోసం కేటాయించేందుకు సేకరిస్తున్నారు. అయితే ప్రభుత్వపరంగా నిధులు లేకపోవడంతో సంబంధిత మండలాల్లోని ప్రముఖల నుంచి చందాలను వసూలు చేసి నిర్వహిస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిసింది. మండలస్థాయి, జోనల్ స్థాయి, జిల్లాస్థాయి ఇలా ఏ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినా బాధ్యులైన నిర్వాహకులకు ప్రముఖల నుంచి చందాలు వసూలు చేయడం తప్పడం లేదని సమాచారం.

పంచాయతీ ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి


కొత్తగూడెంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హైదరాబాద్ నుంచి పంచాయతీ ఎన్నికల నిర్వహణ సన్నదతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి. పాటిల్‌లు అధికారులు కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ ఫొటోతో కూడిన ఓటరు జాబితా రూపకల్పన చేయాలన్నారు. ఓటరు జాబితా నుంచి గ్రామపంచాయతీ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వార్డుల వారీగా కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు గ్రామంలోని వార్డుల వారీగా అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర సిబ్బందిని గుర్తించి ఆ వివరాలను అందజేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించే వారికి అవసరమైన శిక్షణ అందించేందుకు వీలు ప్రతి జిల్లా నుంచి 10 మంది రీసోర్స్ పర్సన్ ఎంపిక చేసి రాష్ట్రస్థాయి శిక్షణకు పంపాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాద్రి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యాచందన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, జడ్పీ సీఈవో చంద్రశేఖర్ రావు, డీపీవో చంద్రమౌళి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎల్‌పీ. సుధీర్‌కుమార్, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఆర్డీవో సన్యాసయ్య జడ్పీ సీఈవో దీక్ష రైనా, ఇన్‌చార్జి డీపీవో నాగలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ రఘురాంరెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎంపీ రఘు రాంరెడ్డి

చంద్రుగొండ, అగస్టు 29: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ రఘు రాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మద్దుకూరు, దామరచర్ల, అయ్యన్నపాలెం, చంద్రుగొండ తదితర గ్రామాల్లో పర్యటించి పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల చికిత్స పొందిన వారికి రూ 1.32 కోట్లు మంజూరయ్యాని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దారం గోవింద రెడ్డి, సీనియర్ నాయకులు మాళోత్ భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఉప్పతల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేటలో ఆయిల్‌పామ్ రిఫైనరీ, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి

అశ్వారావుపేట, ఆగస్టు 29: అశ్వారావుపేటలో ఆయిల్‌పామ్ రిఫైనరీ యూనిట్, ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేల కృషి చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కె. పుల్లయ్యలు వినతి పత్రం ఇచ్చారు. గురువారం అశ్వారావుపేటలో ఎంపీని కలసి ఈ వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలో లక్షా ఇరవైఐదు వేల ఎకరాలలో పామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయని, రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, ముడి సరుకు అందుబాటులో ఉన్నందును రిఫైనరీ యూనిట్‌ను అశ్వారావుపేటలో ఏర్పాటు చేయించాలని కోరారు. అలానే రైతులకు సూచనలు, సలహాలు, ఇతర ఇబ్బందులకు పరిష్కారం కనుగొనేందుకు ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రాన్ని అశ్వారావుపేటలో ఏర్పాటు చేయాలని కోరారు.

వామ్మో.. బయోమెట్రిక్ హాజరు

- మూడు డివిజన్లకు ఒకే మిషన్
- హాజరు నమోదుకు పక్కడివిజన్లకు వెళ్తూ ప్రమాదాలు
- 25 మిషన్లతో 600 వందల మంది కార్మికులకు హాజరు


బయోమెట్రిక్ హాజరు వేస్తున్న కార్మికులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భద్రయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: పారిశుధ్య కార్మికుల హాజరులో పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన బయో మెట్రిక్ హాజరు మిషన్లు ఇప్పుడు పారిశుధ్య కార్మికులు, జవాన్ల ప్రాణాల మీదకు తెస్తున్నా యి. ఒక్కో కార్పొరేటర్ డివిజన్‌లో పది నుంచి 15 మంది వరకు పారిశుధ్య, ఫాగింగ్, ఇతర విభాగాల కార్మికులు పనిచేస్తున్నారు. ఖమ్మం నగర పాలక సం స్థ పరిధిలో 60 డివిజన్లుండగా, కేవలం 25 బయో మెట్రిక్ మిషన్లు ఉన్నాయి. వీటి ద్వారా 600 మంది కార్మికులకు పైగా హాజరు నమోదు జరగాల్సి ఉంటుంది. వీటిలో నాలుగు మిషన్లు మరమత్తులకు గు రయ్యాయి. దీంతో ఒక్కో బయో మెట్రిక్ మిషన్ ద్వారా రెండు నుంచి మూడు డివిజన్ల హాజరు నమోదు చేస్తున్నారు. మామిళ్లగూడెంలో పారిశుధ్య పనులు చేసిన కార్మికులు పాత బస్టాండ్ సెంటర్ వద్దకు వెళ్లి బయో హాజరు నమోదు చేయాల్సి వస్తోంది. ఉదయం 5.15గంటలకు పారిశుధ్య కార్మికులు విధులకు వెళ్తే, వారి హాజరు నమోదు జరిగే వరకు ఉదయం 7.30 గంటల వరకు సమయం పడుతోంది. అలాగే మధ్యాహ్నం 1గంటకు పారిశుధ్య కార్మికులు హాజరు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లాల్సి ఉండగా, సాయంత్రం 3.30 గంటల వరకు పడుతోంది. దీంతో పనులు పూర్తి జరిగిన తర్వాత కూడా కార్మికులు డివిజన్లలోనే నిరీక్షణ చేస్తున్నారు.

ప్రాణాల మీదకు వస్తున్న బయో హాజరు

45వ డివిజన్‌లో జవాన్‌గా పనిచేస్తున్న బోడ్డు భద్రయ్య పక్క డివిజన్‌లో ఉన్న బయో మెట్రిక్ మిషన్ తీసుకెళ్లేందుకు వెళ్తు రోడ్డు ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయాలై ఇంట్లో వైద్య సేవలు పొందుతున్నా రు. పారిశుధ్య కార్మికులు సైతం పని చేసిన తర్వాత నిరీక్షణ చేయలేక హాజరు నమోదు కోసం పక్క డివిజన్లకు వెళ్తు ప్రమాదాలకు గురతున్నారు. మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించి డివిజన్‌కు ఒక బయో మెట్రిక్ హాజరు మిషన్ ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. నూతన బయో మెట్రిక్ హాజరు మిషన్లు కొనుగోలు చేస్తామన్నారు.

విషజ్వరాలను నివారించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు29: విషజ్వరాలు నివారించాలంటే రోగులకు సకాలంలో వైద్యం అందజేసి రక్షించుకోవాలని భద్రాద్రి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కన్‌నాయక్ వైద్యాధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, వైద్యులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర వినోదరావు

నేలకొండపల్లి, ఆగస్టు29: ఎన్నికల్లో హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి తాండ్ర వినోద్‌రావు విమర్శించారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రధానమైన హామీలు ఆరింటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అడ్డమైన ఆంక్షలను పెడుతున్నదని ఆరోపించారు. రుణం ఉన్న ప్రతి రైతుకూ రుణ మాఫీ చేయని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒకే తాను ముక్కలని, బీఆర్‌ఎస్ త్వరలో కాంగ్రెస్‌లో విలీనం కానుందన్నారు. నేలకొండపల్లిలో ప్రభుత్వ వైద్యశాలలో పరిస్థితులను మెరుగుపర్చాలన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని వినోద్ రావు కార్యకర్తలను కోరారు. కొత్తకొత్తూరులో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూతుస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటుగా వార్డుల్లో పేరుకు పోయిన సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్, దళిత మోర్చా నాయకుడు సూరేపల్లి జ్ఞానరత్నం, తోగటి వీరాచారి, మొయినుద్దీన్, కందరబోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

రాధాకృష్ణ మూర్తికి తుది వీడ్కోలు


రాధాకృష్ణమూర్తి కుమారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, ఆగస్టు 29: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం విశ్రాంత హరిదాసు, భక్తరామదాసు తీసుకొచ్చిన హరిదాసు వంశపారంపర్య వ్యవస్థలో ఆఖరివారు శేషం రాధాకృష్ణమూర్తికి గురువారం తుది వీడ్కోలు పలికారు. బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన రాధాకృష్ణమూర్తికి ఆయన కుమారులు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు భద్రాద్రి దేవస్థానం తరఫున హరిదాసు రాధాకృష్ణమూర్తికి శేష వస్త్రం, శేష మాలికను సమర్పించారు. కాగా రాధాకృష్ణమూర్తి పార్థీవ దేహాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం రాధాకృష్ణమూర్తి కుమారుడైన శేషం వెంకటేశ్వరరావుతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా పలువురు నాయకులు, పట్టణ ప్రముఖులు, ఆయన వద్ద విద్యాబోధన చేసిన విద్యార్థులు అధిక సంఖ్యలో అయన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎల్‌ఆర్‌ఎస్ మెసేజ్‌లు

- ప్రభుత్వ స్థలాలు, భూదాన్, వక్ఫ్, అసైన్డ్ భూముల సర్వే నెంబర్ల ప్లాట్‌లకు హెచ్చరిక
- హెల్ప్‌డెస్క్‌కు క్యూ కడుతున్న ఓనర్లు



ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: ప్రభుత్వ భూములు, వక్ఫ్ భూములు, భూదాన్ భూములు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల సర్వే నెంబర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించింది. ఎల్‌ఆర్‌ఎస్‌లో ఆయా భూములను ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణ జరగకుండా సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాఫ్ట్‌వేర్ ద్వారా అనుసంధానం చేశారు. ఒక సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూములు, వక్ఫ్ భూములు, భూదాన్ భూములు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదంలో ఉండే భూములు ఉంటే ఆ సర్వే నెంబర్‌లో దరఖాస్తులు చేసిన అన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సెల్‌ఫోన్ మెసేజ్‌లు పంపుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ నెంబర్‌తో పాటుగా మీ దరఖాస్తు పరిశీలనకు చెల్లదని సమాచారం వస్తోంది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్ సెంటర్‌కు గుబులుగా క్యూ కడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో డాక్యుమెంట్ నెంబర్‌ను నమోదు చేసి హెల్ప్‌డెస్క్ సిబ్బంది వివరిస్తుండటంతో వెనుదిరుగుతున్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే సమాచారంతో భయపడాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో భద్రాద్రి జిల్లా క్రీడాకారుడికి గోల్డ్‌మెడల్


మాల్టా దేశంలో పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన వంశీ

భద్రాచలం, ఆగస్టు 29: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారుడు మోడెం వంశికి బంగారు పతకం లభించింది. యూరప్‌లోని మాల్టా దేశంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వంశి మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహించాడు. దేశం తరఫున 66 కేజీల జూనియర్స్ విభాగంలో బెంచ్ ప్రెస్ 140 కేజీలు, స్కాట్స్ 280 కేజీలు, డెడ్ లిఫ్ట్ 242.5 కేజీలు మొ త్తంగా 662.5 కేజీల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. భద్రాచలం సిటీ స్టయిల్ జిమ్‌కు చెందిన వంశీ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రోత్సాహంతో పలు పోటీలకు ఎంపికై ప్రతిభ చాటుతున్నాడు.



వినాయక మండపాల వద్ద రాజకీయాలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న సీఐ మురళి

ముదిగొండ, ఆగస్టు 29: వినాయకచవితి పండుగ అందరికి సంబంధించిందని వినాయక మండపాల వద్ద రాజకీయాలకు తావివ్వొద్దని ముదిగొండ ఎస్‌హెచ్‌వో(సీఐ) వడ్డేపల్లి మురళీ సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటుచేసే నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకతీకతంగా మండపాల వద్ద నిర్వహణ ఉండాలని, ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని కోరారు. నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పల్లెల్లో లోపించిన చెత్తశుద్ధి

- డీజిల్ కొరతతో నిరుపయోగంగా ట్రాక్టర్లు
- ఇళ్లలో పేరుకుపోతున్న చెత్త
- దినదినాభివృద్ధి చెందుతున్న దోమలు
- కలుషితమవుతున్న తాగునీరు
- వ్యాప్తి చెందుతున్న వ్యాధులు



గోపాలపేటలో నిరుపయోగంగా పంచాయతీ ట్రాక్టర్

తల్లాడ, ఆగస్టు 29: గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిర్ణీత గడువు ప్రకారం నిధులు విడుదల కాకపోవడంతో పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. చెత్త శుద్ధి లోపించింది. డీజిల్ కొరత, నిర్వహణ లేకపోవడంతో రెండురోజులకోసారి పల్లెల్లో ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్తను సేకరించాల్సిన ట్రాక్టర్లు కదలకుండా నిరుపయోగంగా మారాయి. తాగునీటి క్లోరినేషన్, పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు, ఫాగింగ్ వంటివి సక్రమంగా నిర్వహించటం లేదు. దీంతో ఇళ్లల్లో చెత్త పేరుకుపోయి దోమలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధిగ్రస్తులు వేలాదిరూపాయలు ఖర్చుచేసి చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. 2021-22 సంవత్సరంలో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా రెండురోజులకోసారి ప్రతి ఇంటినుంచి తడి, పొడి చెత్త సేకరణ కోసం తల్లాడ మండలంలోని 27గ్రామపంచాయతీల్లో 29ట్రాక్టర్లు, ట్రక్కులు కొనుగోలు చేశారు. అప్పట్లో గ్రామపంచాయతీల్లో ఉన్న నిధుల సౌలభ్యతను బట్టి 11గ్రామపంచాయతీలు పూర్తిగా నగదు చెల్లించి ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. మిగిలిన 16గ్రామపంచాయతీలు బ్యాంకుల నుంచి అప్పు తీసుకొని ప్రతినెలా ఈఎంఐ రూపంలో బకాయిలు చెల్లిస్తున్నారు. కేంద్రప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఆర్థికసంఘం ద్వారా ప్రతి గ్రామపంచాయతీకి ప్రతినెలా జనాభా ప్రాతిపదికన తలసరి నిధులు విడుదల కావల్సి ఉంది. కేంద్రప్రభుత్వం నుంచి విడుదల కావల్సిన 15వ ఆర్థికసంఘం నిధులు కొంత కాలంగా ఐదునెలలకోసారి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఆర్థికసంఘం ద్వారా 18నెలలకోసారి చొప్పున నిధులు విడుదలవుతున్నాయి. దీంతో ట్రాక్టర్ల ఈఎంఐ కిస్తీలు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, కరెంట్ బిల్లులు, తాగునీటి సరఫరా పథకం, చేతినీటి పంపుల రిపేర్లు, వీధిలైట్లు, స్టేషనరీ, శాశ్విత అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లింపు వంటి వాటికి సరిపోక నిధుల కొరతతో పంచాయతీలు సతమతమవుతున్నాయి. నిధుల కొరత వల్ల డీజిల్‌కు డబ్బులు లేక రెండురోజులకోసారి ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాల్సిన ట్రాక్టర్లు కదలకుండా నిరుపయోగంగా ఉన్నాయి.

మండలంలోని పల్లెల్లో నెలకొక్కసారి కూడా వీధుల్లో బ్లీచింగ్, సున్నం చల్లకపోవడం, వాటర్‌ట్యాంకులను కడిగి శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ పౌడర్ కలిపి తాగునీటిని క్లోరినేషన్ చేయకపోవడం, సైడ్‌డ్రెయినేజీల్లో పూడిక తొలగించకుండా క్లీన్ చేయకపోవడం, పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించకపోవడం వల్ల పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ఈ ఏడాది జనవరి నెలాఖరులో ముగిసింది. గ్రామపంచాయతీల నిర్వహణ భారమంతా పంచాయతీ కార్యదర్శులపై పడింది. ఒక్కో గ్రామపంచాయతీలో ఐదారునెలలపాటు అప్పు చేసి ట్రాక్టర్లకు డీజిల్ కొనుగోలు, కరెంట్ ఛార్జీలు చెల్లించటం కోసం పంచాయతీ కార్యదర్శులు రూ.50వేల నుంచి రూ.రెండు లక్షల వరకు అప్పులు చేశారు. గతనెల 22న తల్లాడ మండలంలో పనిచేసే 14మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. 14గ్రామపంచాయతీల్లో అప్పులు చేసిన పంచాయతీ కార్యదర్శులు తమకు రావల్సిన బకాయిల గురించి ఒక వైపు ఆందోళన చెందుతుండగా వారి స్థానంలో కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు పరపతి లేక పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు.

వారానికోసారి కూడా చెత్త సేకరించటం లేదు

కూచిపూడి వెంకటేశ్వర్లు, గోపాలపేట



డీజిల్‌కు డబ్బులు లేవనే కారణంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా మా గ్రామంలో వారానికొకసారి కూడా ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ జరగడం లేదు. దీనివల్ల ఇళ్లలో చెత్త పేరుకుపోయి దోమలు పెరిగి వైరల్ జ్వరాలు, డెంగ్యూ వంటి వ్యాధుల బారీనపడాల్సి వస్తుంది. గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి.

పారిశుధ్య లోపం వల్లే వ్యాధుల వ్యాప్తి

మూలగుండ్ల నాగేశ్వరరావు, మల్లవరం



గ్రామపంచాయతీల్లో నిధులు లేని కారణంగా పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకొనే వారే కరువయ్యారు. వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ చేయకపోవడం వల్ల తాగునీటి సరఫరా వల్ల కలుషితమై ప్రతి ఇంటా ప్రజలు వ్యాధుల బారీనపడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో కొంతమేరకు నిధులున్నప్పటికీ ఆయా పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యానికి కూడా ప్రజలు వ్యాధులు బారీనపడుతున్నారు.

కేఎంసీ కమిషనర్‌కు వినతులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ వెంచర్‌కు చెందిన గ్రీన్ బెల్ట్ స్థలాలు దుర్వినియోగం జరుగుతున్నాయని వాటిని కాపాడాలని స్థానికులు గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రాలు అందజేశారు. ఒక ప్రాంతంలో 302 గజాలు, మరో ప్రాంతంలో 1270 గజాల గ్రీన్ బెల్ట్ స్థలం దుర్వినియోగం జరిగిందని శ్రీనివాసరావు, నర్సింహారావు, కోటి, ఉపేందర్, సురేశ్ తదితరులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

సెల్ పోన్ సిగ్నల్ టవర్ తొలగింపు కోసం

42వ డివిజన్ నిజాంపేటలో నివాస గృహాల మధ్యలో సెల్ పోన్ సిగ్నల్ టవర్ ఏర్పాటు చేయటంతో స్థానికులు రేడియేషన్ సంబంధిత వ్యాధులకు గురైతున్నారని వెంటనే సిగ్నల్ టవర్‌ను తొలగించాలని స్థానికులు భూమిక, మౌనిక, రమేశ్, నారమ్మ, గౌస్ బాష, సాదిక్, పర్వీన్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. చిన్న పిల్లలు సైతం అనారోగ్యానికి గురైతున్నారని ఆరోపించారు.

కేఎంసీలో వివాదం

- అసిస్టెంట్ కమిషనర్ జోక్యంతో ముగింపు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: జనన ధృవీకరణ పత్రం కోస వచ్చిన కానిస్టేబుల్‌కు ఇన్‌వార్డు ఉద్యోగి మద్య వివాదం రావటంతో అసిస్టెంట్ కమిషనర్ జోక్యంతో ముగిసింది. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి ఓ కానిస్టేబుల్ వచ్చి జనన ధృవీకరణ పత్రం రాసేందుకు ఇన్‌వార్డు సిబ్బంది సహాయం కోరారు. ఈ క్రమంలో నిరక్షరాస్యులకు మేము సహాయం చేస్తాం అని ఇన్‌వార్డు ఉద్యోగి మాట్లాడటంతో వివాదం ఏర్పడింది. ఒక వైపు కానిస్టేబుల్ మరో వైపు కేఎంసీ ఉద్యోగులు వాగ్వాదం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ అక్కడకు చేరుకొని ఇరువురికి సర్దిచెప్పటంతో వివాదం ముగిసింది.

ఫైనాన్స్ ఉద్యోగి దాడి: బాధితుడికి గాయాలు

వైరా ఆగస్టు 29: మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం నారపోగు లక్ష్మణరావుపై ఒక ఫైనాన్స్ ఉద్యోగి దాడిచేసిన సంఘటన ఇది. బాధితుడు గురువారం రాత్రి వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మణరావు ఒక ఫైనాన్స్ కంపెనీ దగ్గర ఒక పరుపు, బీరువా కొనుగోలు కోసం రూ.15వేలు రుణం తీసుకున్నాడు. ప్రతీ నెల రూ.11వందల చొప్పున చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు 11నెలలనుంచి సక్రమంగానే ఫైనాన్స్ కంపెనీకి లక్ష్మణరావు రుణాన్ని చెల్లించాడు, ఇంకా కేవలం 3 నెలల కిస్తీలు చెల్లిస్తే తన బాకీ తీరిపోతుంది. ఈ తరుణంలోనే ఫైనాన్స్ ఉద్యోగి ఉపేందర్ దౌర్జన్యంచేసి గాయపరచాడని బాధితుడు లక్ష్మణరావు పోలీసుకు ఫిర్యాదు చేశాడు. అయితే లక్ష్మణరావుకు చెందిన కొందరు తనపై దాడి చేశారని ఫైనాన్స్ ఉద్యోగి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించాలి: బీజేపీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 29: నిర్లక్ష్యం వీడి సత్తుపల్లిలో నూతనంగా నిర్మితమైన వంద పడకల ఆసుపత్రికి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి ప్రారంభించాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక రింగ్‌సెంటర్ బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. జిల్లా మంత్రులతో పాటు స్థానిక ఎమ్మె ల్యే జోక్యం చేసుకుని ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కలుగజేసుకుని వెంటనే వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పడగల మధుసూదన్‌రావు, చావా కిరణ్, మట్టా ప్రసాద్, ఆచంట నాగస్వామి, పాలకొల్లు శ్రీను, పర్సా రాంబాబు, రహ్మతుల్లా, జొన్నలగడ్డ నరేష్, భీమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఆచంట సుబ్రహ్మణ్యం, చక్కా మధుసూదనరావు, పమ్మి నరసింహారావు, చీకటి వసంత రావు, కార్తీక్, శివ, విజయ్, మిట్టపల్లి నాగరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

టీటీ క్రీడాకారులకు దుస్తుల వితరణ

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 29: హైదరాబాద్‌లో ఈనెల 30 నుంచి జరిగే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా టీటీ జట్టు క్రీడాకారులకు గురువారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్ డ్రెస్‌లను వితరణ చేశారు.

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం

మధిరటౌన్, ఆగస్టు 29: టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం సంఘ నాయకులు మధిర లో నిర్వహించారు. మధిర తహసీల్దార్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ జిల్లా కన్వీనర్ కొణిదన శ్రీనివాసరావు, అధ్యక్షుడు పెద్ద పుల్లయ్య, నాయకులు జైపాల్, ప్రకాష్, శ్రీనివాస్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అనాథాశ్రమానికి ఇన్వర్టర్ వితరణ

వైరా, ఆగస్టు 29: తన భర్త కందిబండ బాలమురళీ కృష్ణ జ్ఞాపకార్థం మండలంలోని గొల్లపూడిలో ఉన్న మహిళా అనాథాశ్రమానికి ఇన్వర్టర్‌ను కందిబండ శైలజరాణి అందజేశారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బాలమురళీ కృష్ణ కొన్నేళ్ల కిందట అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందారు. తన భర్త జ్ఞాపకార్థం శైలజారాణి కుమారులు రాకేష్, రాజేష్‌తో కలిసి ఈ ఇన్వర్టర్‌ను గురువారం అందజేశారు. అనాథ వృద్ధ మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. ఇమ్మడి పుల్లారావు, షేక్.లతీఫ్, వెంపటి కోటేశ్వరరావు, కౌశల్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.ఐదువేల ఆర్థికసాయం

వైరా, ఆగస్టు 29: వైరా శాంతినగర్‌లో ఇటీవల జ్వరంతో మృతిచెందిన ఐదేళ్ల చిన్నారి సిద్ధిక్ కుటుంబానికి మార్పు స్వచ్ఛంద సంస్థ గురువారం రూ.ఐదువేలు ఆర్థికసాయం చేశారు. సిద్ధిక్ తల్లిదండ్రులు అక్బర్, నూర్జహాన్‌కు రూ.ఐదువేలు అందించారు. సంస్థ నిర్వాహకులు గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, కుదురుపాక సుధాకర్ పాల్గొన్నారు.

సీపీఎం సానుభూతిపరుడి కన్నుమూత

ఖమ్మం రూరల్, ఆగస్టు 29: మండల పరిదిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతి పరుడు వెన్ను తిరుమలయ్య (80) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుబూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిద్దినేని కోటయ్య, యల్లంపల్లి నాగయ్య, రంజాన్ , ఉపేందర్, జక్కంపూడి కృష్ణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడి మృతి

కారేపల్లి, ఆగస్టు 29: మండల పరిధిలోని రేగులగూడెం గ్రామపంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఏపే శ్రీను (42)గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహన్ని మండల సీఐటీయూ కార్యదర్శి కె.నరేందర్ వివిధగ్రామపంచాయతీలకు చెందిన పలువురు వర్కర్లు సందర్శించి నివాళ్ళులర్పించారు. శ్రీను కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

డంపింగ్ యార్డు నుంచి దుర్గందం: స్థానికుల ఇబ్బందులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: నిబంధనల మేరకు డంపింగ్ యార్డు నిర్వాహణ లేకపోవటంతో తరుచూ వివాదాల్లోకి వెళ్తోంది. నిన్నటి వరకు రోడ్డు సమస్యతో డ్రైవర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టగా గురువారం రాత్రి డంపింగ్ యార్డుకు సమీపంలోని ప్రజలు ఇళ్లలో ఉండలేని దుర్గందం వ్యాపించింది. ఖమ్మం నగరంలోని హోటల్స్, రెస్టారెంట్లు, కమర్షియల్స్ నుంచి చెత్త సేకరణకు ఇకోటిక్ సంస్థతో కేఎంసీ ఒప్పందం చేసుకొంది. నిబంధనల మేరకు హోటల్స్, రెస్టారెంట్ వ్యర్థాలను ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేసి తొలగించాల్సి ఉంటుంది. కానీ నిర్వాహకులు చెత్త వాహనంలోనే హోటల్స్, రెస్టారెంట్ వ్యర్థాలను కలిపి డంపింగ్‌యార్డుకు తరలించి దిగుమతి చేశారు. దీంతో గురువారం రాత్రి డంపింగ్ యార్డు నుంచి దుర్గందపు వాసన వ్యాపించింది. దీంతో రాపర్తినగర్, బీసీ కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ, వివేకనంద నగర్, దన్వాయిగూడెం, రామన్నపేట, రెండు పడకల ఇళ్ల కాలనీ తలుపులు కిటికీలు మూసుకున్నారు. కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేశారు.

ప్రైవేటు పాఠశాలల టీచర్లకు అవార్డు అందించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉపాధ్యాయ అవార్డులను ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అందించాలని సంఘం అధ్యక్షుడు రామారావు కోరారు. గురువారం డీఈవో సోమశేఖర శర్మను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందిస్తున్న అవార్డులను ఇవ్వాలని కోరారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 2కె రన్ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 29: క్రీడా దినోత్సవ వేడుకలును గురువారం నగరంలోని పలు ప్రవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని రెజొనెన్స్ శ్రీనగర్ కాలనీ పాఠశాలలో క్రీడలను పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు ప్రారంబించారు. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. త్రివేణి పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళ్లులు అర్పించిన పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్.

తిమ్మరావుపేటలో 2కే రన్

ఏన్కూరు, ఆగస్టు29: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా డీవైఎస్‌వో ఆదేశాల మేరకు గురువారం తిమ్మరావుపేట గ్రామంలో 2కేరన్‌నిర్వహించారు. ఈకార్యక్రమంలో తిమ్మరావుపేట హైస్కూల్, ఏన్కూరు టీజీఆర్ఎస్ స్కూల్, ఓం ఆదిత్య గాయత్రి స్కూల్, సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి రమేష్, గ్రామస్తులుకొనకంచి రామకృష్ణ, లచ్చిరామ్, పిచ్చయ్య, షకీల్, సత్యం, మిట్టపల్లి హరిబాబు, పీఈటీ లు శ్రీనివాస్, శోభన్, బీమేష్, సలీం, సైదాం, భరత్, షాబీర్ పాల్గొన్నరు

ముదిగొండ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఖానాపురం జడ్పీఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, పీడీ వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఆర్జేసీ ప్రభంజనం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 29: కాకతీయ యూనివర్శిటీ బుధవారం విడుదల చేసిన డిగ్రీ 2, 4 వ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని ఆర్జేసీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బీకాంలో కె మానస 9.07, బి గోపిక 8.66, శ్రీదివ్య 8.10 జీపీఏ తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాదించారని తెలిపారు విద్యార్థులను చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ లింగయ్య, అధ్యాపకులు అభినందించారు.

డీసీఎంఎస్ స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధిరటౌన్, ఆగస్టు 29: మధిర పట్టణం మధ్యలో ఉన్న డీసీఎంఎస్ స్థలాన్ని కొందరు ఆక్రమణదారులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేసిన స్థలాన్ని మధిరటౌన్ ఎస్ఐ సంధ్య గురువారం పరిశీలించారు. దాదాపు నాలుగు కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేయడంతో ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించివేసి ఆక్రమణకు యత్నించిన వారిపై డీసీఎంఎస్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్ఐ సంధ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించారు.

అప్పులున్నా ఆగని సంక్షేమం: ఎమ్మెల్యే

- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేసిన ఎమ్మెల్యే రాగమయి



కల్లూరులో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు/తల్లాడ/పెనుబల్లి ఆగస్టు 29: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఎప్పుడు అండగా నిలుస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం కల్లూరు రైతు వేదిక ప్రాంగణంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రాగమయి ప్రసంగిస్తూ తమ సెప్టెంబరు 17 నుంచి రెండవ విడతగా ప్రజాపాలన గ్రామ సభలు జగనున్నాయని అందులో రేషన్‌కార్డులు, హెల్త్ కార్డులకు దరాఖాస్తులకు ప్రాధన్యత నివ్వటం జరగుతుందన్నారు. రుణమాఫీ కింద ప్రతి రైతుకుటుంబానికి ప్రభుత్వం రూ.2 లక్షలు అందిస్తుందని చెప్పారు. ఇంకాను ఇందిరమ్మ గృహాలు అందించేలా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండల పరిధిలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ 50, సీఎంఆర్ఎఫ్ 140 చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ బాబ్జీప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి మోహన్‌రావు, ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, లింగనబోయిన పుల్లారావు, భూక్యా శివకుమార్‌నాయక్, ఎస్‌కే ఉస్మాన్, తురాబుఅలీ, బూదాటి నారపరెడ్డి, తోటకూర రామకృష్ణ, కీసర శ్రీనువాస రెడ్డి, కీసర మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తల్లాడ: రాష్ట్రం రూ.ఏడులక్షల కోట్ల మేరకు అప్పులున్నా సంక్షేమ పథకాల అమలు ఆపకుండా కొనసాగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదప్రజలను ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం తల్లాడ రైతువేదికలో 150మంది సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 50మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలుచేస్తుందన్నారు. రూ.రెండులక్షల రుణమాఫీ కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి వారికి రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, డీటీ వనజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, ధనేకుల రవి, గోవిందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పెనుబల్లి: పెనుబల్లి రైతువేదికలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా 98మందికి రూ.27.13లక్షల చెక్కులతోపాటు ఒక షాదీముబారక్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, కాంగ్రెస్ నాయకులు పొట్లపల్లి వెంకటేశ్వరరావు, చిన్ననర్సింహారావు, బొర్రా కోటేశ్వరరావు, రాచబోయిన కోటేశ్వరరావు, పంది వెంకటేశ్వరరావు, ఎడ్ల నర్సింహారావు, కీసర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హార్వెస్ట్ కళాశాలలో మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 29: నగరంలోని హార్వెస్ట్ కళాశాలలో గురువారం విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్‌పై ఖమ్మం నగర ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, విద్యా సంస్థల కరస్పాండెంట్ రవి మారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి హజరై మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడపటం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం అన్నారు. వాహనం నడుపుతూ పట్టుపడితే కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 25 వేల జరిమానా తోపాటు మూడు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకన్న, సాగర్, హోంగార్డు నాగేశ్వరరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పారిశుధ్య వాహనాలకు కళ్లెం

- స్వచ్ఛభారత్, ప్రైవేట్ చెత్త సేకరణ ఆటోలకు జీపీఎస్ ట్యాగింగ్ అమరిక

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 29: ప్రాంతాలతో సంబంధం లేకుండా నివాసాలు, కమర్షియల్స్ విధానాలను పాటించకుండా చెత్త సేకరణ చేసి ఇష్టాను సారంగా డంపింగ్ యార్డులో చెత్తను దించుతూ పలు సమస్యలు సృష్టిస్తున్న ప్రైవేట్ పారిశుధ్య వాహనాలకు కేఎంసీ అధికారులు కళ్లేం వేశారు. కమర్షియల్ ప్రాంతాలు, ప్రైవేట్ హాస్పటల్స్ నందు ఇకోటిక్ సంస్థ ద్వారా వ్యర్థాలను సేకరించాల్సి ఉంటుంది. నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే స్వచ్ఛ భారత్, ప్రైవేట్ ఆటోలు చెత్తను సేకరించాల్సి ఉంటుంది. అయితే కొంతమంది ప్రైవేట్ హాస్పటల్స్ నిర్వాహకులు నెలకు రూ.700 ఇవ్వలేక ఇకోటిక్ సంస్థకు కాకుండా ప్రైవేట్ చెత్త వాహనాలకు వ్యర్థాలను ఇస్తున్నారు. దీంతో మెడికల్ వ్యర్థాలతో డంపింగ్ యార్డు కుళ్లి పోతుంది. డంపింగ్ యార్డుకు వెళ్లిన కార్మికులకు ఇంజెక్షన్లు, వైద్య పరికరాలు గుచ్చుకుంటున్నాయి. దీంతో ప్రైవేట్ పారిశుధ్య వాహనాలపై కేఎంసీ అధికారులు ని ఘా ఉంచేందుకు గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ ప్రభుత్వ స్వచ్ఛ భారత్ 45, ప్రైవేట్ ఆటోలు 40, ఇకోటిక్ 12వాహనాలకుకు జీపీఎస్ మిషన్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రైవేట్ చెత్త సేకరణపై కేఎంసీ అధికారుల పర్యవేక్షణ పట్టు దొరికింది.

ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి తనయుడి జన్మదినం



చింతకానిలో రక్తదానం చేస్తున్న దృశ్యం

మధిరటౌన్/చింతకాని/ఎర్రుపాలెం, ఆగస్టు 29: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలను గురువారం మధిరలో ఘనంగా నిర్వహించారు. మధిర లోని భట్టి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఇంచార్జ్‌లు రంగారెడ్డి, శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిది వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మునిసిపల్ కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు కర్నాటి రామారావు నాయకులు పాల్గొన్నారు. చింతకానిలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కంచుమర్తి రామకృష్ణ, పాశం సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఎర్రుపాలెంలో కాగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు తలపురెడ్డి నాగిరెడ్డి, మండల నాయకులు అనుమోలు కృష్ణారావు, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్‌జానీబాషా, మీడియసెల్ చైర్మన్ మల్లెల లక్ష్మణరావు, టౌన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అభ్యర్థి వేజెండ్ల సాయి, మధిర నియోజకవర్గ యూత్ అభ్యర్థి తుమాటి నవీన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్‌గాంధీ పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు: డీఏవో

- కొనసాగుతున్న రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వే

సత్తుపల్లి, ఆగస్టు 29: జిల్లావ్యాప్తంగా ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య అన్నారు. గురువారం సత్తుపల్లి మండలం తాళ్లమడలో రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వే నిమ్మితం నిర్వహించిన సర్వేతీరును పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి కుటుంబ సభ్యుల నిర్ధారణకై అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో ఈ సర్వే జరుగుతున్నదని, బ్యాంకుల నుంచి రుణం తీసుకుని రేషన్‌కార్డ్ లేని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వీ.శ్రీనివాసరెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవోలు టీ.నరేష్, కే.ఆశాజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

● కల్లూరు: మండలంలోని తెలగవరం గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ చేపట్టిన రైతు కుటుంబ సర్వే నిర్ధారణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య, ఏడీఏ ఎం శ్రీనివాసరెడ్డిలు క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. రైతు రుణమాఫీ పథకంలో కుటుంబాల వారిగా రేషన్‌కార్డుల, ఆధార్ కార్డుల వారిగా సమాచారం సేకరించి సగటున రైతు కుటుంబాలను నిర్ధారణ చేస్తామని ఏఓ రూప తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

● పెనుబల్లి: మండలంలోని బయ్యన్నగూడెంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వే నిర్వహించారు. కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏవో ఏవీఎస్.ప్రసాద్ రాజు, ఎంఈవోలు కె.నరేష్, లక్ష్మీభవానీ, నాగరాజు, బుచ్చిబాబు, రైతులు పాల్గొన్నారు.

● తల్లాడ: రూ.రెండులక్షల రుణమాఫీకి అర్హులైన కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం గురువారం తల్లాడ మండలంలోని లక్ష్మీపురం, కేశ్వాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో 57మంది రైతులకు సంబంధించి కుటుంబ నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు శివకుమారి, నరేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగిరం చేయాలి

- అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 29: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రోజువారి లక్ష్యం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ధరణి కింద టీఎం-33 మాడ్యూల్ దరఖాస్తులు 3391, ఇతర మాడ్యూల్‌ల క్రింద 5513 దరఖాస్తులు వివిధ స్థాయిలో పెండింగులో ఉన్నాయన్నారు. తహసీల్దార్లు దరఖాస్తుల పరిష్కారం విషయంలో ఆధారాలు సరిగా చూపాలన్నారు. డిలీషన్ విషయంలో నోటీసులు అందజేసిన ఆధారాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించాలని, ఏ దశలోనూ పొరపాట్లు జరగకుం డా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి సత్ఫలితాలను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుదారుడు అధికారుల చర్యలతో సంతృప్తి చెందాలన్నారు. పెన్షన్లకు సంబందించి అన్ని దరఖాస్తులకు సత్వరం పరిష్కరించాలన్నా రు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా చూడాలన్నారు. వివిధ ట్రిబ్యున ల్, కోర్టుల కేసుల విషయంలో చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. సర్వే నెంబర్ల వారిగా ప్రభుత్వ భూమి వివరాల నివేదిక సమర్పించాలన్నారు. ఆక్రమణలకు గురి అయిన ప్రభుత్వ స్థలాల స్వాధీనానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలున్న ప్రభుత్వ స్థలాల విషయంలో నెలకొక బీట్ చొప్పున లక్ష్యం పెట్టుకొని, సమస్యలు పరిష్కరించి, స్థలాల స్వాధీనం తర్వాత ఫెన్సింగ్ ఏర్పాటు, ప్రతి వారం ఆయా స్థలాల సందర్శన చేసి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.